క్లుప్తంగా

విద్యార్థినికి అండగా నిలిచిన యువత



రూ. 10 వేలు ఫీజు అందజేస్తున్న సముద్రాల శ్రీధర్

బేతంచెర్ల: పట్టనంలోని ఓ ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని రేష్మ కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక పోవడంతో పట్టణానికి చెందిన యువకులు అండగా నిలిచారు. గురువారం విద్యార్థినికి సంబంధించిన రూ. 10 వేల ఫీజును యువకులు సముద్రాల శ్రీధర్, జశ్వంత్ రెడ్డి, పెసలశ్రీధర్, రవీంద్ర, శివ, మురళీ, సుధాకర్ అందజేసి మానవత్వం చాటుకున్నారు.

16 నుంచి రంగాపురంలో ఉరుసు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన శ్రీ సయ్యద్ షా అల్లాబకాష్ ఖాద్రి స్వామి వారి ఉరుసు ఉత్సవాలు మూడురోజులపాటు నిర్వహిస్తున్నట్లు దర్గా ధర్మకర్త, గ్రామ పెద్దలు తెలిపారు. 16న గంధం,17న ఉరుసు, 18న జియారత్ వేడుకలు ఉంటాయన్నారు. మతసామరస్యానికి ప్రతికగా జరుపుకునే ఈ ఉత్సవాల్లో కబడ్డీ పోటీలను కూడ నిర్వహిస్తున్నామని, ఉత్సాహవంతులు ఎంట్రీఫీజు చెల్లించి పోటీల్లో పాల్గొనాలన్నారు.

బనగానపల్లె తహసీల్దార్‌గా రవీంద్రారెడ్డి



బాధ్యతలు స్వీకరించిన రవీంద్రారెడ్డి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె మండల నూతన తహసీల్దార్‌గా రవీంద్రారెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఎన్నికల నేపథ్యం బదిలీల్లో భాగంగా కడప జిల్లా కలసపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రవీంద్రారెడ్డి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారంతో పాటు ఎన్నికలు సక్రమంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తామన్నారు.

టీషర్టుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో అద్భుతమైన క్రీడా నైపుణ్యం కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వచ్చారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంపికైన వైఎస్ఆర్ సచివాలయ విద్యార్థినుల క్రికెట్ జట్టుకు గురువారం ఆయన టీషర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మేకల విమల, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామానికి చెందిన రామక్క ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ గుండాల సుమిత్రయ్య కుమారులు జైపాల్, సుజన్ గురువారం ఆమెకు పెద్దల సమక్షంలో రూ. 10 వేలు అందజేశారు. కుమారుడు, కుమార్తెను పోషించలేక రామక్క ఇబ్బందులు పడుతుందని, బాధిత కుటుంబానికి ఆధార్ కార్డు, రేషన్‌కార్డు ఇప్పించి ప్రభుత్వ పథకాలు వర్తించేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి అవార్డులు



అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్

డోన్ టౌన్ : గతేడాది సంభవించిన మిచాంగ్ తుఫాన్‌లో విద్యుత్ సర్వీసు పునరుద్ధరణలో డోన్ సిబ్బంది చేసిన సేవలను గుర్తించి ఉన్నతాధికారులు అవార్డులు అందజేశారు. గురువారం కర్నూలు ఎస్ఈ కార్యాలయంలో ఏపీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు, ఎస్ఈ ఉమాపతి చేతుల మీదుగా సిబ్బందికి అవార్డులు ఇచ్చారు. డోన్ విద్యుత్ శాఖలో పని చేస్తున్న చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున డామేజ్ పోల్స్, ఫోన్ ఎరక్షన్, డీటీఆర్ ఎరక్షన్ తదితర విభాగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు ఉన్నతాధికారులు అవార్డులు అందజేసి అభినందించారు. అదేవిధంగా అవార్డు గ్రహీతలకు డోన్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సన్మానం

డోన్ టౌన్ : స్థానిక సచివాలయంలో పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రష్మి పదోన్నతిపై వెల్దుర్తి రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా వెళ్తున్న సందర్భంగా గురువారం ఆమెను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ ఉప్పరి రాధమ్మ, ఉప సర్పంచ్ రెడ్డి, వార్డు మెంబర్లు భూషణం, గ్రామ నాయకులు రామాంజనేయులు తదితరులు రష్మిని ఘనంగా సత్కరించారు.



నాడు ఏపీ మోడల్‌స్కూల్ రహదారి దుస్థితి



నేడు కళకళలాడుతున్న ఏపీ మోడల్‌స్కూల్ రోడ్డు

నెరవేరిన దశాబ్దాల కల!

- మంత్రి బుగ్గన చొరవతో విద్యార్థుల సౌకర్యార్థం రూ.68లక్షలతో రోడ్డు నిర్మాణం
- తీరిన ఏపీ మోడల్, గురుకుల, కస్తూర్బా స్కూళ్ల రహదారి సమస్య
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



రూ. 68 లక్షలతో నిర్మించిన రోడ్డులో మంత్రి చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్న విద్యార్థినులు(ఫైల్)



డోన్ : విద్యారంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. నాడు– నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసింది జగనన్న ప్రభుత్వం. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వం దాదాపు దశాబ్దాలుగా నెలకొన్న విద్యార్థుల రహదారి సమస్యనూ పరిష్కరించడంతో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. 2006లో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డోన్ పట్టణ శివారులోని ఉడుములపాడు వద్ద 44వ జాతీయ రహదారి నుండి ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో మోడల్ స్కూల్, ఏపీ గురుకుల, కస్తూర్బా పాఠశాలలు, హాస్టళ్లను నిర్మించారు. ఆ ప్రాంతం విద్యార్థులతో కళకళలాడింది. అదేవిధంగా కోట్ల విజయభాస్కర్‌రెడ్డి పేరుతో ఔట్‌డోర్ స్టేడియం, సివిల్ సప్లై గోడౌన్‌ను నిర్మించారు. ఈ భవనాలతోపాటు స్కూళ్ల చూసేందుకు ముచ్చటగా ఉండేది. అయితే రహదారి సమస్య తీవ్రంగా ఉండేది. అనంతరం అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం కనీసం రోడ్డును కూడా నిర్మించలేదు. దీంతో విద్యార్థులతోపాటు ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ప్రత్యేకించి విద్యార్థులు రాళ్లరోడ్డులో నడుస్తూ నకరయాతన పడ్డారు. ఇక వర్షా కాలం ఇబ్బందులు వర్ణనాతీతం. బురదమయమైన రోడ్డులో నడుస్తూ ఎంతో మంది విద్యార్థులు కిందపడిన సందర్భాలు కోకొల్లలు.

మంత్రి బుగ్గన చొరవతో రోడ్డు నిర్మాణానికి రూ.68లక్షలు మంజూరు

గత ప్రభుత్వంలో ఈ రోడ్డు సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో రోడ్డు నిర్మాణానికి రూ.68లక్షలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు కిలోమీటర్నర తారురోడ్డును నిర్మాణం పూర్తయింది. ఇటీవల మంత్రి బుగ్గన ఈ రోడ్డుపై పాదయాత్ర చేయగా విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్న విషయం తెలిసిందే. దీంతో 1,540 మంది విద్యార్థులు రహదారి సమస్య తీరింది. దాదాపు రెండు దశాబ్దాలుగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు మంత్రి బుగ్గన చొరువతో తీరాయి. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు వేస్తారని ఊహించ లేదు



మా పాఠశాలకు రహదారి సౌకర్యం కల్పిస్తారని కలలో కూడా ఊహించ లేదు. పదేళ్ల నుండి సరైన రహదారి సౌకర్యం లేక అనేక ప్రమాదాలు జరిగాయి. వర్షాకాలంలో అధ్యాపకులతో పాటు మేము పడిన బాధలు వర్ణనాతీతం. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పందించిన తీరు అభినందనీయం. మంత్రి సాయం విద్యార్థులు ఎప్పటికీ మరువరు.

–ప్రియాంక, 10వ తరగతి విద్యార్థిని, ఏపీ మోడల్ స్కూల్.

ఇబ్బందులు పడకుండా వెళ్తున్నాం



ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వచ్చేది. పలుమార్లు కిందపడిన సందర్భాలు ఉన్నాయి. చక్కటి రహదారిని ప్రభుత్వం కల్పించడంతో సురక్షితంగా స్కూల్‌కు వెళ్లగలుగుతున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు ఆర్థిక మంత్రి బుగ్గనకు విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఋణపడి ఉంటాం.

– రాంచరణ్‌గౌడ్, 10వ తరగతి ఏపీ మోడల్‌స్కూల్.

చాలా సంతోషంగా ఉంది



చక్కని పాఠశాలలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, ముచ్చటైన రహదారులు ఉంటేనే విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోగలుగుతారు. మానసికంగా ఎదగగలుగుతారు కూడా. ఇందుకు అనువైన వాతావరణాన్ని కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పాటు ఆర్థిక మంత్రి బుగ్గనకు ప్రత్యేక కతజ్ఞతలు. చాలా సంతోషంగా ఉంది.

– రెబికా, వ్యాయామ ఉపాధ్యాయురాలు, ఏపీ మోడల్‌స్కూల్.

ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించాలి



సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న డీపీఎం నరేంద్రారెడ్డి

బనగానపల్లెరూరల్ : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రోగ్రామింగ్ మేనేజర్ (డీపీఎం) నరేంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని యాగంటిపల్లెలో రైతు పరమేశ్వర రెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా 1.20 ఎరాల్లో సాగు చేసిన 26 రకాల పంటలను డీపీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభించడంతో పాటు భూమిలో పోషకలు అభివృద్ధి చెందుతాయన్నారు.

కేసు నమోదు

బనగానపల్లె : బనగానపల్లె పట్టణానికి చెందిన లక్ష్మీకాంతమ్మ దూరపు బంధువులైన నంద్యాలకు చెందిన శ్రీధర్, సురేంద్ర, బీఆర్ శ్రీనివాసులు, బనగానపల్లెకు చెందిన గడ్డం గంగాధర్‌రెడ్డి, డ్యాక్యుమెంట్ రైటర్ రామాంజనేయులు, ప్యాపిలి సబ్ రిజిస్ట్రార్ ఫైరోజ్, బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులపై కోర్టు ఆదేశాల మేరకు అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామిరెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కర్నూలుకు చెందిన అనంత సుబ్బారావుకు మామ అయిన బనగానపల్లెకు చెందిన అప్పాజీ సత్యనారాయణరావు 2005లో పట్టణంలో ఒక ఇల్లును రాసి ఇచ్చారు. అయితే అప్పాజీ సత్యనారాయణరావు చనిపోయాక అతని భార్య లక్ష్మీకాంతమ్మ తన దూరపు బంధువులు కలిసి వెంకటసుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో అనంత సుబ్బారావు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

ముగిసిన సువార్త స్వస్థత మహాసభలు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



సభకు హాజరైన ప్రజలు

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని వెంకటనాయుని పల్లె రోడ్డులో మూడు రోజులుగా కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వస్థత సువార్త మహా సభలు గురువారం ముగిశాయి. తెలంగాణ రాష్ట్రం బెల్లంపల్లికి చెందిన ప్రముఖ వ్యాఖ్యాత పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్ దైవ వ్యాఖ్యాన్ని వివరించి స్వస్థత ప్రార్థనలు చేశారు. అదేవిధంగా రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో డోన్ పాస్టర్ల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షులు పాస్టర్ నిత్యానందం, కమిటీ సభ్యులు మోహన్‌రావు, వినోద్, శ్యాంసన్, ప్రవీణ్, ఆదాం, ఏడీ రాజు, మేరిమియా, జాన్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఆర్బీకేను ప్రారంభిస్తున్న నాయకులు

డోన్ రూరల్ : పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వెంకటనాయునిపల్లి, కామగానకుంట్ల గ్రామాలలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్‌లను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక శాఖమంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో డోన్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. గ్రామాలలోనే ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే గ్రామంలో చూపించుకోవడానికి వీలుగా ఒక హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, డాక్టర్‌ను సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. క్యాబినెట్‌లో డోన్ నియోజకవర్గానికి హార్టికల్చర్ అండ్ వ్యవసాయ పాలిటెక్నికల్ కాలేజీలను మంజూరు చేయడం అభినందనీయమని, ప్రజల తరుపున వారు మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చంద్రన్న, సర్పంచ్‌లు రాధమ్మ, ఉల్చాల మద్దిలేటి, చంద్రశేఖర్‌నాయుడు, సుంకులమ్మ, ఎంపీటీసీ జానకిరాం, వైఎస్సార్ సీపీ నాయకులు రాంకుమార్‌యాదవ్, పెద్దరాజు, వేమారెడ్డి, తిమ్మారెడ్డి, రామకృష్ణ, ఏఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో సచివాలయం-1 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఉంటుందని జిల్లా వైస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పట్టణంలోని ప్రియా గ్రాఫిక్స్ సెంటర్ నుంచి ఎల్ఐసీ ఆఫీస్‌రోడ్డు, రంగరాజుపేట, ముత్తుమియ్యా కాలనీల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పర్యటిస్తారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

కోవెలకుంట్ల: శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర హెచ్చరించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గురువారం రాత్రి మండలంలోని భీమునిపాడు గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో అలజడులు, గొడవలు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర సూచించారు. గురువారం పట్టణంలోని ముదిగేడు చౌరస్తా నుంచి జమ్మలమడుగు టర్నింగ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డుపై వాహనాలు నిలుపడంతో వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలను నిలుపాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాల రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

అసత్య ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు

డోన్ టౌన్: యాత్ర 2 సినిమాపై తప్పుడు జీవోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్ర2 సినిమాపై సోషల్ మీడియాలో ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు వస్తున్న అసత్య కథనాలను నమ్మొద్దని, వీటిని ఇతర గ్రూపుల్లో పోస్టు చేసినా, ఇతరులకు ప్రచారం చేసిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాలతో సుపరి పాలన



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్



ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన బుగ్గన కుమార్ రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సుపరిపాలన సాగిస్తున్నారని, పార్టీలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరక్టర్ ముర్తుజావలి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ తెలిపారు. మండలపరిధిలోని కొలుములపల్లె గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఎస్సీ కాలనీలో రూ.7.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటి హాల్‌ను గురువారం ఎంపీడీఓ రవి ప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ గణేష్, గ్రామ సర్పంచ్ మద్దమ్మ, ఎంపీటీసీ మరియమ్మ ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలకు 50 సెంట్లు విరాళంగా ఇచ్చిన దాత బుగ్గన రాజగోపాల్ రెడ్డి కొడుకు బుగ్గన కుమార్ రెడ్డిని సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమర్థవంతమైన పాలన, అభివృద్ధి కోసం వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బ్రహ్మేశ్వర్ రెడ్డి ఇంటికి వారు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలోసింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, గూని నాగరాజు, సునీల్ రెడ్డి, ఎద్దులన్న, తిమ్మయ్య, బ్రహ్మేశ్వరయ్య, నాగార్జున్ రెడ్డి, చంద్ర శేఖరయ్య, నాగేశ్వరరావు, తిమోతి, తిమ్మారెడ్డి, కంట్రాక్టర్ ఖాదర్, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీపీ

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లో గురువారం అభివృద్ధి పనులను మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరక్టర్ బాబుల్ రెడ్డి ప్రారంభించారు. రూ.75 లక్షలతో నిర్మించిన ఒకటి, రెండవ గ్రామ సచివాలయాలు, రూ.17.50 ను లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను గ్రామ సర్పంచ్ ఏస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత, ఎంపీటీసీలు శాంతి, ఇందిర ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. ముందుగా గ్రామానికి వచ్చిన నాయకులపై పూల వర్షం కురిపిస్తూ మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు యాకోబ్, యోబ్, మహేష్, ఓంశివ, సత్యం, కుమార్ నాగరాజు, గిడ్డయ్య, జాకబ్, ఐజయ్య, నాగేశ్వర్‌రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి

వైభవంగా ఉమామహేశ్వరుల కల్యాణం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఏకశీలారూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరులకు అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సీనియర్ విలేకరి మధు మృతి

డోన్ టౌన్ : ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి కె.మధు (35) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. ఐదు నెలల క్రితం స్థానిక తారకరామ గనర్ రహదారిలో రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. తీవ్రగాయాలకు గురైన మధు అనారోగ్యానికి గురై చికిత్సలు పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. మధు స్వగ్రామమైన కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామంలో గురువారం అంత్యక్రియలు చేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామ శివారులో బెల్ట్‌షాప్ ద్వారా మద్యం విక్రయిస్తున్న సుబ్బయ్యను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. గ్రామ శివారులో కాశిపురం రోడ్డుకు వెళ్లే దారిలో మద్యం విక్రయిస్తుండగా దాడులు చేశామన్నారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సుబ్బయ్యపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్ఐ తెలిపారు.

పరీక్షల భయం వీడాలి



విద్యార్థినికి పరీక్ష ప్యాడ్ అందజేస్తున్న దృశ్యం

సంజామల: పది విద్యార్థులు పరీక్షల భయం వీడాలని, క్రమ శిక్షణతో చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెండేకంటి కరణ్ కుమార్ సూచించారు. మండల కేంద్రం సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జెడ్పీ, కస్తూర్బా పది విద్యార్థులకు వారు పరీక్షల ప్యాడ్, పెన్‌లు వారు అందజేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందజేస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. పది పూర్తయ్యాక సంజామల ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజయ్య, ప్రిన్సిపల్ నాగమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు తనిఖీ చేసిన డీపీఓ



జ్వాలాపురంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిపల్లె, పాతపాడు, జ్వాలాపురం గ్రామాలలో గురువారం డీపీఓ మంజులవాణి పర్యటించారు. అదేవిధంగా యాగంటిపల్లె, పాతపాడు గ్రామాల్లో సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, అభివృద్ధి పనుల వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను పరిశీలించి, గ్రామ పంచాయతీ అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు

బనగానపల్లె రూరల్ : పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు అధికారులకు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు,సెక్టోరల్ ఆఫీసర్స్, పోలీసు ఆఫీసర్లుతో పోలింగ్ కేంద్రాల్లో మౌలికవసతుల కల్పనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ఆఫీసర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, మంచినీరు, టాయిలెట్స్, గాలి, వెలుతురు వచ్చేలా వసతులు సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండలాల తహసీల్దార్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.